www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 2 డిసెంబర్ 2024
5
చిత్తూరు



విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు యత్నం

అడ్డుకున్న సీపీఎం నాయకులు



ప్రజాశక్తి-పలమనేరు: విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును సీపీఎం నాయకులు అడ్డుకున్నారు. పలమనేరులో ఇంటింటికీ, షాపులకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు దొంగచాటుగా బిగిస్తున్న విషయం తెలుసుకొని అక్కడికి చేరుకున్నారు. ఆదివారం ఉదయం 10గంటలకు బస్టాండ్‌లో స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని సిపిఎం జిల్లా నాయకులు గిరిధర గుప్త అడ్డగించారు. ప్రభుత్వం మాట తప్పి ఇలా స్మార్ట్ మీటర్లు పెట్టడం ప్రజలను మోసం చేయడమేనని, గతంలో జగన్ ప్రభుత్వం అదానీ మేలు కోసం రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు సంతకం పెట్టారు. ఆనాడు కూటమి పార్టీల నేతలు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించారని, మీటర్లు పగులకొట్టండి అన్నట్లు గుర్తు చేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత అవే మీటర్లను బిగిస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వం అవినీతితో చేసిన ఒప్పందాలను వీరు ఎలా అమలు చేస్తున్నారు? కరెంటు ఛార్జీలు పెంచబోమని చెప్పిన మాటను నిలబెట్టుకోవాలి.. ఉన్న మీటర్లు తీసేసి.. కొత్త మీటర్లు ఎందుకు పెడుతున్నారు? అంటు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చర్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.



పతాక ఆవిష్కరణ



మహా సభలు ప్రారంభిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాస రావు

మహాసభల సంరంభం

- ఉద్యమాలకు ఉత్తేజం
- అదానీ కుంభ కోణంపై.. మోడీ పెదవి విప్పాలి
- విద్యుత్ ట్రూ అప్ చార్జీలు తగ్గించాలి
- రాయలసీమ జిల్లాలకు నిధులు ఇవ్వాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి/సత్యవేడు

ప్రపంచాన్ని కుదిపేస్తున్న సోలార్ విద్యుత్ కుంభకోణంపై దేశ ప్రధాని నరేంద్ర మోడీ పెదవి విప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కుంభకోణంలో అదానీతో పాటు మోడీ, జగన్, చంద్రబాబులకు వాటా ఉందని ఉద్ఘాటించారు. తూర్పు దిక్కు ఉద్యమాల గడ్డ సత్యవేడులో సిపిఎం 14వ జిల్లా మహాసభలు ఉత్సాహంగా, చైతన్య స్ఫూర్తితో ప్రారంభమయ్యాయి. జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివచ్చాయి. జోరు వాన కురుస్తున్నా కదం తొక్కుతూ, పదం పాడుతూ కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్ వరకు ముందుకు సాగారు. ప్రజా నాట్య మండలి, జానపద వృత్తి కళాకారుల డప్పు వాయిద్యాల మధ్య ముఖ్య అతిధులు బహిరంగ సభా ప్రాంతం వద్దకు చేరుకున్నారు. అరుణ పతాకాల రెపరెపలతో ఆ ప్రాంతంతో పాటు సత్యవేడు ఎరుపెక్కింది. సీపీఎం పతాకాన్ని ఆవిష్కరించారు. ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పించారు. తిరుపతి జిల్లా అభివృద్ధి, పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల భవిష్యత్ పోరాటాల తీర్మాణాన్ని ప్రవేశపెట్టారు. అనంతరం బహిరంగ సభనుద్దేశించి శ్రీనివాసరావు మాట్లాడారు. డబ్బు, కులం, కుటుంబ పాలనలాంటి అంశాలు ఈ రోజుల్లో అధికారాన్ని, నాయకులను తయారు చేస్తున్నాయన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా తారతమ్యాలకతీతంగా నాయకత్వాన్ని ఎంపిక చేస్తున్న పార్టీ సీపీఎం అన్నారు. ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయాలను కోరుకుంటున్నారనీ భవిష్యత్తు కమ్యూనిస్టులదేనని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో ఓ కీలక వ్యక్తికి సోలార్ విద్యుత్ కుంభకోణంలో రూ.1700కోట్లు ముట్టాయని అంతర్జాతీయ మీడియా కోడై కూస్తున్నా మోడీ, చంద్రబాబులు ఎందుకు విచారణ జరపడంలేదని ప్రశ్నించారు. తాను మోడీ చెప్పినట్లు చేశానని జగన్, మోడీ చెప్పకుండా తానేమీ చేయలేనని చంద్రబాబులు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ అదానికి కొమ్ము కాస్తున్నారని విమర్శించారు. మోడీ పాలనలో ఉద్యోగులు, కార్మికుల వేతనాలు 8 నుంచి 3 శాతానికి పడిపోగా నిత్యావసర ధరలు మాత్రం 8 నుంచి 16 పెరిగాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక రెండు సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై రూ.16వేల కోట్ల భారం మోపినా అడిగే దిక్కులేదన్నారు. డిసెంబర్ 1 నుంచి చార్జీల వడ్డనకు పూనుకుంటున్న నేపథ్యంలో వెంటనే ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాలని హెచ్చరించారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ వెనుకబడిన రాయలసీమ జిల్లాల అభివృద్ధికి కేంద్రం బడ్జెట్ నయా పైసా కేటాయించలేదని మండిపడ్డారు. తిరుపతి జిల్లా సమగ్రాభివృద్ధి సాధించేందుకవసరమైన తీర్మాణాన్ని ప్రవేశపెట్టారు. మన్నవరం బెల్ పరిశ్రమను పునరుద్దరించాలని కోరారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలని సూచించారు. ప్రభుత్వ విద్యా సంస్థలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆస్తి పన్ను పెంపును రద్దుచేయాలన్నారు. దశల వారీ మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, హత్యలను నిలువరించాలని డిమాండ్ చేశారు. అధిక ధరల తో నియంత్రణతోపాటు, కార్మికుల వేతనాలను రూ.26 వేలకు పెంచాలని కోరారు. పులికాట్ సరస్సును అభివృద్ధి పరచి, మత్స్యకారులకు బాసటగా నిలవాలని చెప్పారు. చేనేత, పవర్ ల్యూమ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కార్యదర్శి సభ్యులు దాసరి జనార్ధన్ మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గం విద్య, వైద్యం, వ్యవసాయ పరంగా వెనకబడిందన్నారు. శ్రీసిటీ సెజ్‌లోని 200పరిశ్రమల్లో 6వేల మంది కార్మికులు పనిచేస్తున్నా సరైన వేతనాలు, పిఎఫ్ సౌకర్యాలు అందడం లేదని వాపోయారు. మాన్ పవర్ కాంట్రాక్టర్లు కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని మండిపడ్డారు. సత్యవేడులో ఉన్న రెండు గురుకులాలు దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏకైక డిగ్రీ కళాశాలను మరో ప్రాంతానికి తరలించే కుట్ర చేస్తున్నారని ఆందోళన వ్యక్తపరిచారు. అరణియార్, ఉబ్బలమడుగు ప్రాజెక్టులున్నా సాగునీటి కరువును తీర్చుకోలేని దుస్థితిలో తూర్పు మండలాల రైతులున్నారని వాపోయారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మూలం రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు భాస్కరయ్య, చిత్తూరు జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి, అంగేరి పుల్లయ్య, సీపీఎం నాయకులు రమేష్, సుబ్రమణ్యం, సాయి లక్ష్మీ, జయ చంద్ర, హరినాధ్, మాధవ్, వెంకటేష్, అరుణాచలం, శివకుమార్, గంధం మణి, అల్లెయ్య, వేణు, భగత్, పెనగడం గురవయ్య తదితరులు పాల్గొన్నారు.



సీనియర్లకు సన్మానం

ఎయిడ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత



హెచ్ఐవి అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న చుడా చైర్‌పర్సన్ హేమలత

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా హక్కుల మార్గాన్ని అనుసరిద్దామని, నా ఆరోగ్యం నా హక్కు నినాదంతో ముందు కెళ్లాలని, ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని చుడా చైర్ పర్సన్ కటారి హేమలత తెలిపారు. ఆదివారం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు "ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ ర్యాలీ కార్యక్రమం చూడ చైర్ పర్సన్, డిఎంహెచ్‌వో డాక్టర్ ప్రభావతి దేవి జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో హెచ్ఐవి/ఎయిడ్స్ నివారణకు నినాదాలతో అపోలో విద్యార్థులు గాంధీ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టి ప్రతిజ్ఞ నిర్వహించారు. తదనంతరం జెడ్పి మీటింగ్‌లో హెచ్ఐవి/ఎయిడ్స్‌పై కళాజాత బృందంతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్, అపోలో ప్రొఫెసర్ డాక్టర్ దీపిక, డిబిసిఎస్ డాక్టర్ అర్పిత, డాక్టర్ శిరీష, డాక్టర్ లోకేష్, డాక్టర్ అనిల్, తదితర డాక్టర్లు, స్వచ్ఛంద సేవా సంస్థ సిబ్బంది, అపోలో విద్యార్థులు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

సోమల: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమలలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధి అంతం మన అందరి పంతం అవగాహనతోనే ఎయిడ్స్ వ్యాధిని పూర్తిగా అరికట్టవచ్చు సురక్షిత లైంగిక సంబంధాలతో ఎయిడ్స్ వ్యాధిని నిరోధిద్దాం అంటూ నినాదాలు చేశారు. వైద్యాధికారులు జయసింహ, ప్రదీప్ కుమార్ రెడ్డి, సిహెచ్‌ఓ అమర్నాథ్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రామకుప్పం: మండల పరిధిలోని విజలాపురం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎయిడ్స్ రహిత సమాజం స్థాపిద్దామని వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పూజిత మాట్లాడుతూ.. ఎయిడ్స్ వల్ల జరుగు అనర్థాలను, తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ బాలు, సిబ్బంది సుజాత, సుకన్య, శ్రావణి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

యాదమరి: ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యాదమరి సిహెచ్‌వో లక్ష్మీనారాయణ, డీపీఎమ్‌వో మణి పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆరోగ్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు లక్ష్మీపతి, సెల్వరాణి, ఎంఎల్‌హెచ్‌పిలు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



యాదమరిలో ర్యాలీ చేపడుతున్న వైద్యాధికారులు



సోమలలో ర్యాలీ చేపడుతున్న అధికారులు, సిబ్బంది

అధ్యాపకుల కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రభుత్వ అధ్యాపకుల నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం స్థానిక ఎస్‌పిఎస్ డిగ్రీ కళాశాల్లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఈశ్వరబాబు అధ్యక్షతన జరిగింది. జిల్లా అధ్యక్షులుగా డాక్టర్ వాసు, కార్యదర్శిగా తిరుకుమారన్, మహిళా కార్యదర్శి వెనీల, కోశాధికారి భానుప్రకాష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ అధ్యాపకుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు రాఘవరెడ్డి మాట్లాడుతూ అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం నిత్యం కృషి చేస్తున్నట్లు చెప్పారు. తిరుపతి జిల్లా కార్యదర్శి వెంటక కృష్ణయ్య నూతన చిత్తూరు జిల్లా కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.

నేడు విద్యా సంస్థలకు సెలవు



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జిల్లాలో ఫెంగాల్ తుఫాన్ నేపథ్యంలో ముందస్తు చర్యలలో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు, కళాశాలలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం చిత్తూరు కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉ.9.30గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు కలెక్టరేట్‌లోని నూతన సమావేశపు మందిరంలో నిర్వహించనున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. దీనితో పాటు నియోజకవర్గ, మండల స్థాయిలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులందరూ విధిగా హాజరుకావాలని ఆదేశించారు.




కార్వేటినగరం: నేలకొరిగిన మర్రిచెట్టు



సదుం: నేలకూలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



విజయపురం: నీట మునిగిన పంట



నిండు కుండలా తొనుకుతున్న ఎన్‌టీఆర్ జలాశయం

ఫెంగల్.. ఫియర్!

- వీడని వాన.. వణికిస్తున్న చలి
- నిండు కుండలా చెరువులు, జలాశయాలు
- పలు చోట్ల తీవ్ర పంట నష్టం
- అక్కడక్కడా స్తంభించిన రాకపోకలు
- ఇంకొన్ని చోట్ల నేలకొరిగిన వృక్షాలు
- మరికొన్ని ప్రదేశాల్లో కూలిన విద్యుత్ స్తంభాలు
- కొనసాగుతున్న ముసురు వాన

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఫెంగల్ తుఫాను ప్రభావంతో చిత్తూరు జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా కురిస్తున్న వర్షాలతో జిల్లాలో చలితీవ్రత పెరిగింది. జిల్లాలోని ఎన్‌టిఆర్ జలాశయం, కృష్ణపురం రిజర్వాయర్ పూర్తి స్థాయిలో నిండి నిండు కుండలను తలపిస్తున్నాయి. ఆదివారం ఎన్‌టిఆర్ జలాశయం నీటి మట్టం పూర్తి స్థాయికి చేరుకోవడంతో జలవనరులశాఖ అధికారులు రెండు గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. చిత్తూరు నీవానదిలో నీటి ప్రవాహం కొనసాగుతోంది.

సాహసించిక కార్మికులు

ప్రజాశక్తి-పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద చెరువు వెళ్లే కాలువలో చెత్తాచెదారం చేరి పూర్తిగా మూసుకుపోయింది. దీంతో మున్సిపాలిటీ కార్మికులు తీవ్ర వర్షాన్ని లెక్కచేయకుండా సాహసించి అక్కడ చెత్తను తొలగించి కాలువ నీరు సాఫీగా వెళ్లేందుకు శుభ్రం చేశారు.ం



కాలువ చెత్తను శుభ్రం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

పొంగిపొర్లిన వాగులు

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండలంలో ఫెంగల్ తుపాన్ ప్రభావంతో వాగులు వంకలు పొంగిపొర్లి ప్రవహించాయి. పాపిరెడ్డిపల్లి, పాతపాలెం, జిఎంఆర్ పురం వాగులు ప్రవాహానికి సుమారు 10గ్రామాలకు పైగా రాకపోకల అంతరాయం కలిగింది. తహశీల్దార్ లోకనాథ పిళ్లై, ఎంపీడీవో మురళీమోహన్, ఎస్ఐ సుమన్ ప్రజలను అప్రమత్తం చేశారు.

వెదురుకుప్పం: తుపాను ప్రభావంతో చెరుకు రైతులకు అపార నష్టం కలిగింది. ఏపుగా పెరిగిన చెరుకు పంట నెల రోజుల్లో కట్ చేయాల్సి ఉండగా తీవ్ర గాలి, వర్షానికి నేలవాలింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు.

సదుంలో అస్తవ్యస్తం

సదుం: మండలంలో ఫెంగల్ తుపాన్ తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ఆదివారం కురిసిన భారీ వర్షాలకు, అమ్మగారిపల్లి, కంభంవారిపల్లి, తిమ్మానాయనపల్లి, చెరుకువారిపల్లి, బూరగమంద, పాలమంద తదితర గ్రామాలలో కోత దశలో ఉన్న సుమారుగా 14హెక్టార్ల వరి పైరు నేలకొరిగినట్లు మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ తెలిపారు. ఆరు గ్రామాల్లోని 33మంది వరి రైతులు నష్టపోయినట్లు వివరించారు.

జలహారతి

ప్రజాశక్తి-కార్వేటినగరం: భారీ వర్షాలు కురుస్తున్న వేళ ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రాకుండా ఇళ్లలోనే ఉండాలని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఆదేశించారు. ఆదివారం జోరు వానలో మండలంలోని అమ్మగారి చెరువు నిండడంతో ఎమ్మెల్యే జలహారతి పట్టారు. తుపాను నష్టాలు, దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇప్పించేందుకు సీఎం దృష్టికి తీసుకెళతానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ కొమ్ము నాగరాజు, ఎంపీడీవో చంద్రమౌళి, నాయకులు మాజీ సర్పంచ్ పరందాం, నాగేశ్వర రాజు, చెంగల్రయమండడి, జనార్ధన్ రాజు, సరిత పరందాం, మురళీకృష్ణ, రమేష్, దాము తదితరులు పాల్గొన్నారు.



జలహారతి పడుతున్న ఎమ్మెల్యే

శవంతో సాహసయాత్ర

ప్రజాశక్తి-విజయపురం(నగరి): మున్సిపల్ పరిధి 1వ వార్డు నగరి పేట గ్రామంలోని బడివీధిలో అనారోగ్యంతో మృతిచెందిన ఒక యువతి అంత్యక్రియలు అయినవాళ్లను అష్టకష్టాల పాలు చేసింది. ఫెంగల్ తుఫాను ప్రభావంతో లోతట్టు ప్రాంతమైన నగరిపేట బడివీధి పూర్తిగా జలమయమైంది. వర్షపు నీరు వెళ్లేందుకు దారిలేక పోవడంతో నీరు వీధులపై నుంచి శ్మశానం వరకు పారింది. దీంతో యువతి అంత్యక్రియలకు వెళ్లేందుకు వర్షపు నీరు అడ్డంకిగా మారింది. చేసేదేమీ లేక ప్రవహిస్తున్న మోకాలిలోతు నీటిలోనే శవంతో పాటు సాహసయాత్ర చేయాల్సివచ్చింది. ఎట్టకేలకు శ్మశాన వాటికకు చేరుకున్న బంధువుల కాళ్ల దిగబడిపోతూ బురదమయంగా మారిన శ్మశాన వాటికలోనే అయినవాళ్లు అంత్యక్రియలను పూర్తిచేశారు. వర్షం పడే ప్రతిసారి ఈ ప్రాంతంలో ఇదే పరిస్థితి నెలకొంటోందని, వర్షం ఆగిన వెంటనే అధికారులు ఈ సమస్యను మరచిపోతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.



వాగు నీటిలో శవాన్ని మోసుకొస్తున్న గ్రామస్తులు

జలమయం

ప్రజాశక్తి-విజయపురం: ఫెంగల్ తుఫాను ప్రభావంతో రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. ఆదివారం ఈదురు గాలుల తీవ్రత తగ్గినప్పటికీ తరచూ వర్షం వస్తూ పోతుండడంతో జన జీవనం పూర్తిగా స్తంభించింది. చిత్తూరు-తచ్చూరు హైవే పనుల్లో భాగంగా కళియంబాకం చెల్లాతమ్మ ఆలయ సమీపంలో గ్రామానికి వెళ్ళడానికి హైవే కింది భాగంలో రోడ్డు ఏర్పాటు చేశారు. వర్షపు నీరు వెళ్ళడానికి సరైన మార్గం లేకపోవడంతో వాహన చోదకులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. మండలంలోని వేరుసెనగ, వరి పంటలు నీట మునిగాయాయి. మండలంలో 42 చెరవులు ఉంటే 37చెరువులు నిండు కుండలా మారింది. మండలంలోని ఎస్ఎస్ కండ్రిగ - ఇళ్ళత్తూరు మార్గ మధ్యమంలో వరద ఉధృతి నీరు ఎక్కువ కావడం వలన రోడ్డున ప్రయాణించడం కూడా ఇబ్బందిగా మారిందని గ్రామస్తులు తెలిపారు. వరద ఉధృతి ఎక్కువగా ఉందని లోతట్టు ప్రాంత వాసులు సురక్షిత ప్రాంతాలకు రావాలని తహసీల్దార్ కిరణ్ సూచనలు ఇచ్చారు. చెరువుల్లో లీకేజీలు, గ్రామాల్లో వరదనీరు ప్రవేశించడం వంటి ప్రమాదాలు జరిగినప్పుడు కంట్రోల్ రూం నెంబరు. 9966668994కు సమాచారం అందించాలని కోరారు.

జలాశయాల్లో కళ

- కృష్ణాపురం రిజర్వాయర్ నీటి మట్టం 698.048 ఎఫ్‌టి కాగా ఆదివారం ఉదయం ఆరు గంటలకు 692.408 ఎఫ్‌టిగా ఉంది.
- ఎన్‌టిఆర్ జలాశయం 965.14 ఎఫ్‌టి కాగా ఆదివారం ఉదయం ఆరు గంటలకు జలాశయ పూర్తిగా నిండి జలాశయంలో 965.14 ఎఫ్‌టి నీటి మట్టం చేరుకుంది. రెండు గేట్లు ఎత్తి నీటిని దిగువలకు వదిలారు.

దంచికొట్టిన తుపాను..

- జిల్లాలోని సోమల, ఐరాల, తవణంపల్లి మండలాల్లో సాధారణ వర్షపాతం కంటే అధిక వర్షపాతం నమోదైంది. ఆదివారం జిల్లాలోని నగరి మండలంలో అత్యధికంగా 132.4మిలీమిటర్లు, అత్యల్పంగా గుడుపల్లి మండలం 16.0మిలీమీటర్ల వర్షపాతం నమోదైంది.
- ఫెంగల్ తుపాను ఉత్తర తమిళనాడు పుదుచ్చేరికి దగ్గరగా శనివారం తీరందాటి గంటకు 70-80కిలో మీటర్ల వేగంతో శనివారం 90కిలోమీటర్ల వేగంతో పుదుచ్చేరి వద్ద కేంద్రీకృతమైంది. క్రమంగా బలహీనపడి తీవ్ర అప్పపీడనంగా మారనున్నట్లు వాతావరణ శాఖ తెలియజేసింది. వాతావరణ మార్పులతో జిల్లా వ్యాప్తంగా చలి వణుకుపుట్టిస్తోంది.

కూలిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు

చౌడేపల్లి: మండలంలోని పెద్ద కొండా మర్రి పంచాయతీ కోటూరు సమీపంలో వ్యవసాయానికి అమర్చిన రెండు ట్రాన్స్ఫార్మర్లు, రెండు విద్యుత్ స్తంభాలు ధ్వంసమయ్యాయి. ట్రాన్స్‌కో ఏఈ శశిధర్ సిబ్బంది అప్రమత్తమై విద్యుత్ సరఫరా నిలిపేసి ఎలాంటి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

సదుం: విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్ ఇచ్చిన వివరాల మేరకు.. ఊటుపల్లి పంచాయతీ పరిధిలో చల్లావారిపల్లి ఫీడర్, చల్లావారిపల్లికి దగ్గర్లోని, బొమ్మిరెడ్డి బొమ్మిరెడ్డివారిపల్లి వెనుక బాగాన ఉన్న ఏరియాలోని రైతుల పొలాల్లో ఏర్పాటు చేసిన 3 విద్యుత్ స్తంభాలు, ఒక ట్రాన్స్ఫార్మర్ వర్షాలకు క్రింద పడి పోయినట్లు ఆయన తెలిపారు. చల్లావారిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం లేకుండా మరమ్మతులు చేపట్టామని పేర్కొన్నారు.



సోమల: నేలకొరిగిన వరిపైరు

గుండెపోటుతో జూనియర్ అసిస్టెంట్ మృతి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గుండెపోటుతో యాదమరి మండలంలోని గొల్లపల్లి హైస్కూల్ విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్ శ్రీబాబు(50) మృతి చెందారు. గంగాధరనెల్లూరు దళితవాడకు చెందిన శ్రీబాబు ఆదివారం ఇంటివద్ద గుండె పోటుకు గురికాగా, అతన్ని వెంటనే వారి కుటుంబ సభ్యులు మొదటిగా చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు సలహా మేరకు అక్కడ నుంచి తిరుపతి స్విమ్స్‌కు తరలించగా అక్కడ డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతి చెందారని చెప్పారు. మృతుడు శ్రీబాబు అంత్యక్రియలు సోమవారం మధ్యాహ్నం గంగాధర నెల్లూరులో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అబాకస్‌లో బృందావన్ విద్యార్థుల ప్రతిభ



గెలుపొందిన బృందావన్ పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: తమిళనాడు రాష్ట్రంలోని శ్రీ నారాయణి స్కూల్ శ్రీపురం వేలూరులో ఆదివారం జరిగిన 11వ రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలలో చిత్తూరు బృందావన్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సీనియర్ సెకండరీ పాఠశాల నుంచి 64మంది విద్యార్థులు పాల్గొనడం జరిగింది. వారిలో పి సుదిక్ష ఏడవ తరగతి విద్యార్థిని ఛాంపియన్షిప్ సాధించింది. 8మంది విద్యార్థులు విన్నర్‌గా 16మంది విద్యార్థులు రనర్స్‌గా విజయం సాధించారు. గెలుపొందిన విద్యార్థులను పాఠశాల వ్యవస్థాపకులు శైలజ కుమారి, పాఠశాల డైరెక్టర్ ప్రియ తేజ అభినందించారు.


జిలానీకి ఉత్తమ సేవా అవార్డు



అవార్డు అందుకుంటున్న జిలానీ

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న కె జిలానీ ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు. ఆదివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఓ ప్రభావతి దేవి, జిల్లా లెప్రసి ఆఫీసర్ డాక్టర్ వెంకట ప్రసాద్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. వరుసగా మూడవసారి ఈ అవార్డు అందుకోవడం గమనార్హం. బైరెడ్డిపల్లి వైద్యాధికారులు, సిబ్బంది జిలానీకి అభినందనలు తెలిపారు.

వైభవంగా లక్ష్మీనారాయణ కళ్యాణం



కళ్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరి గ్రామంలో వెలసిన లక్ష్మీనారాయణ కళ్యాణ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ఉత్సవ మూర్తులు శ్రీదేవి భూదేవి సమేత నారాయణలకు పట్టు వస్త్రాలు పూల హారతులతో అలంకరణ చేసి అర్చకులు వేదమంత్రాలు మంగళ వాయిద్యాలు నడుమ కళ్యాణోత్సవం వైభవంగా జరిగింది. విశేష సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ వెంకటేష్ రెడ్డి, అర్చకులు విష్ణుస్వామి పలువురు అర్చకులు పాల్గొన్నారు.

చెరువుల పరిశీలన



ప్రజాశక్తి -కోట : ఫెంగల్ తుపాన్ ప్రభావంతో కోట మండలంలోని పలు చెరువులును అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆదివారం కోట మండలంలోని స్థానిక తహశీల్దార్ కటారి జె జె రావు ఆధ్వర్యంలో ఇరిగేషన్ అధికారులు మునిరత్నం, వర్క్ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్లా, విఆర్ఓ లు వెంకటరమణయ్య, సుబ్రహ్మణ్యం లతో కలిసి కోట చల్ల కాలువ పొర్లు కట్టలను, చిట్టేడు గ్రామంలోని రెండు చెరువులను, ఉదయం నుండి సాయంత్రం వరకు పెన్నక్క చెరువు, తిక్క చెరువు, చిట్టేడు, సిద్ధవరం, కర్లపూడి, ఉత్తమ నెల్లూరు, తదితర గ్రామాల్లోని చెరువులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీసిల్దార్ కటారి జయ జయ రావు మాట్లాడుతూ గత కొన్ని రోజుల నుండి పడుతున్న వర్షాల వల్ల అత్యధికంగా వర్షపు నీరు చేరడంతో చెరువుల పొర్లుకట్టలు తెగిపోకుండా ఉండడానికి ఎక్కడికక్కడ ఇరిగేషన్ అధికారులను, గ్రామ రెవెన్యూ అధికారులను అప్రమత్తం చేశానన్నారు. అంతేకాకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా మండల పరిధిలోని అనుమానస్పదంగా ఉండే చెరువులను పరిశీలించామన్నారు.

నేడు జాబ్ మేళా

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహార్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు, ఇందులో ఏడు కంపెనీలు పాల్గొంటాయని కళాశాల ప్రిన్సిపాల్ బి చంద్రమౌళి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్ఎస్‌సి ఇంటర్, డిగ్రీ, డిప్లమా, పీజీ చదివిన 20 – 30, వయస్సు కలిగిన పురుషులు, స్త్రీలు పాల్గొనవచ్చని అర్హులైన వారు బయోడేటాతో పాటు సర్టిఫికెట్లు. ఆధార్ కార్డు రెండు పాస్ సైజ్ ఫొటోలను ఉదయం 10 గంటలకు సెమినార్ హాల్‌లో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు బాబురావు 9848553724, కేశవ 6304330520 ఫోను నెంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.





స్మాట్‌లాక్‌లపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మీ ఇంటి భద్రత.. మీ చేతుల్లో..

స్మార్ట్ డోర్ లాక్ ఎలా పనిచేస్తుందంటే

ముందుగా లాక్‌ను తెరవండి. దాని శ్యాకిల్‌ను తిప్పి హౌసింగ్‌లో పెట్టి కీ తిప్పండి. ఒక చిన్న బీప్ శబ్దం వినిపించినప్పుడు అలారం యాక్టివేట్ అయినట్లు అర్థం. అలారం యాక్టివేట్ అయిన తర్వాత, ప్యాడ్‌లాక్‌ను ఏదైనా కదిలిస్తే, పూర్తి శక్తితో అలారం మోగుతుంది. ఇందులో లాంగ్ లైఫ్ బ్యాటరీలు ముందుగానే అమర్చబడి ఉంటాయి. లాక్ అయిన తర్వాత వాటిని ఎవ్వరూ తీయలేరు.

- స్మార్ట్ లాక్స్‌తో చోరీలకు చెక్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా పోలీసులు ప్రజల భద్రత కోసం ప్రతి రోజు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారు. అందులో భాగంగా, సమకాలీన సాంకేతికతను ప్రజల భద్రతకు ఉపయోగించుకోవాలని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా అందుబాటులోకి వచ్చిన స్మార్ట్ అలారం ప్యాడ్‌లాక్ గురించి ప్రజలందరికీ అవగాహన కల్పిస్తూ ఈ స్మార్ట్ డోర్ లాక్‌లను అందిస్తున్నారు. సమాజం వేగంగా ఆధునికత వైపు పయనిస్తోంది. ఇలాంటి సమయంలో భద్రత అనేది ప్రతి ఇంటి ప్రధాన అవసరంగా మారింది. ఇంటి భద్రతను మరింత పటిష్టంగా చేసేందుకు స్మార్ట్ డోర్ లాక్స్ ఒక వినూత్న పరిష్కారంగా నిలుస్తున్నాయి. ఈ స్మార్ట్ లాక్స్ దొంగతనాలను నిరోధించడంలో మాత్రమే కాకుండా, సమాజంలో భద్రత పట్ల అవగాహన పెంచడంలో కూడా ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి. చిత్తూరు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో జిల్లాలో ఇప్పటి వరకు సుమారు 6,500 స్మార్ట్ డోర్ లాక్స్‌ను ప్రజలకు పంపిణీ చేయడం జరిగింది. స్మార్ట్ డోర్ లాక్స్ అనేవి సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఆధునిక తలుపు తాళాలు. ఇవి సాధారణ తాళాల కంటే భిన్నంగా ఉంటాయి. ఇవి ఇంటి భద్రతను మరింత పటిష్టంగా మార్చడమే కాకుండా, ఎవరైనా అనుమతి లేకుండా తలుపు తెరవడానికి ప్రయత్నిస్తే వెంటనే అలారం మోగి హెచ్చరిక ఇస్తాయి. ఈ హెవీ డ్యూటీ స్టీల్ అలారం ప్యాడ్‌లాక్ అనేది గాలి, నీటి ప్రభావానికి గురి కాకుండా వెదర్‌ప్రూఫ్ సాంకేతికతతో తయారు చేయబడింది. ప్రత్యేకంగా ఈ ప్యాడ్‌లాక్‌లకు పిక్ రెసిస్టెంట్ కీహోల్ ఉండటం వలన దొంగల ప్రవేశాన్ని అడ్డుకుంటుంది.

చిత్తూరు జిల్లా పోలీసు శాఖ, ప్రజలలో స్మార్ట్ లాక్స్‌పై అవగాహన పెంచడానికి ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తోంది. లాక్స్ ఏర్పాటు, ఉపయోగం, నిర్వహణపై ప్రజలకు సూచనలు ఇస్తున్నారు. స్మార్ట్ లాక్స్ ఎలా పని చేస్తాయో ప్రత్యక్షంగా చూపుతూ, భద్రత కోసం తీసుకోవలసిన ఇతర జాగ్రత్తలపై కూడా అవగాహన కల్పిస్తున్నారు. ప్రముఖ నగరాల్లో అభివృద్ధి చెందిన స్మార్ట్ సిటీల మాదిరిగా, చిత్తూరు జిల్లాను కూడా స్మార్ట్ భద్రతా వ్యవస్థతో ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు పనిచేస్తున్నారు. స్మార్ట్ డోర్ లాక్స్ మాత్రమే కాకుండా, సీసీటీవీ కెమెరాలు, ఇంట్రూడర్ అలారమ్‌లు వంటి పరికరాలను కూడా ఉపయోగించేలా ప్రోత్సహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 11వందల సీసి కెమెరాలు ఏర్పాటు చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వీధికి ఒక్క సిసి కెమెరాను ఏర్పాటు చేసుకొనేలా ప్రజలను కోరుతున్నారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలు, చోరీలు చోటు చేసుకున్న సందర్భాల్లో సీసి కెమెరాల ద్వారా నేరస్తులను గుర్తుపట్టేందుకు పోలీసులకు సీసీ కెమెరా ఫుటేజీలు కీలకంగా పనిచేస్తాయంటున్నారు. నేరస్తులను గుర్తించి అదుపులోకి తీసుకోవడానికి క్రైమ్ కేసులు పరిష్కరించేందుకు వీలుంటుందంటున్నారు.

చెవిరెడ్డిపై పోక్సో కేసులో ఊహించని ట్విస్ట్

- ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేయలేదు
- పిలిస్తే వచ్చిన చెవిరెడ్డిపై కేసు ఎందుకు?
- మీడియా సమావేశంలో బాలిక తండ్రి వెల్లడి



ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఐదు రోజుల క్రితం చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డిపై పోలీసులు పెట్టిన పోక్సో కేసులో ఊహించని ట్విస్ట్ ఎదురైంది. తమ కూతురిపై అత్యాచారం జరగకుండానే జరిగిందని తప్పుడు ప్రచారం చేసి, తమ కుటుంబ పరువుకు భంగం కలిగించారని ఆ బాలిక తండ్రి ఫిర్యాదు చేయగా కేసు పెట్టినట్టు పోలీసులు ఇది వరకే స్పష్టం చేశారు. అయితే తాము ఎవ్వరి మీద పోలీసులకు ఫిర్యాదు చేయలేదని, నా బిడ్డకు అన్యాయం జరిగిందని తానే చెవిరెడ్డికి ఫోన్ చేసి పిలిచానని, తన బిడ్డను చూసి ధైర్యం చెప్పడానికి వచ్చిన చెవిరెడ్డిపై తాను ఎందుకు కేసు పెడతాను?' అంటూ యల్లమంద ఘటనలో బాధితురాలైన బాలిక తండ్రి రమణ పేర్కొన్నారు.

చంద్రగిరి నియోజకవర్గం ఎర్రావారి పాళెం మండలం యల్లమంద నుంచి తిరుపతికి వచ్చిన బాలిక తల్లిదండ్రులు, మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి, వైసీపీ జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డిలతో కలిసి ఆదివారం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. తమ బిడ్డకు అన్యాయం జరిగిందని, మీరు రావాలని చెవిరెడ్డి అన్నను పిలిస్తేనే యల్లమంద ఆసుపత్రికి వచ్చాడన్నారు. ఆయన వచ్చిన వెంటనే ఏం జరిగిందని తనను అడుగగా అప్పటికే తనకు పాప చెప్పిన విషయాలు అన్నీ వివరించాను. ఆ తర్వాత పాపను చూడటానికి ఆసుపత్రిలోకి వెళ్లగా ఓ గదిలో పాపను బంధించి పోలీసులు గుచ్చిగుచ్చి అడుగు తుండగా చెవిరెడ్డి అన్న వారితో మహిళా పోలీసు లేకుండా మీరు ఎలా విచారిస్తారు?' అని అడుగుతూ పాపకు ధైర్యం చెప్పి బయటకు వచ్చారన్నారు. చెవిరెడ్డితో పాటు మేమందరూ బయటకు వచ్చేశామని, ఆ తర్వాత నేను పాప మీద జరిగిన దాడి గురించి మీడియా వాళ్లకు చెబుతుంటే చెవిరెడ్డి ఒకసారి ఆలోచించుకుని చెప్పు..భవిష్యత్తులో పాపకు ఇబ్బంది వస్తుందెమో అని అన్నాడన్నారు. తన బిడ్డపై బిడ్డ శరీరం మీద గాయాలు చూసిన తర్వాత ఇంతకన్నా మాకు జరిగే నష్టం ఏముంటాది, ఇంతకు తెగించిన వారిని ఉరి తీయాలని నేనే మీడియాకు జరిగినదంతా చెప్పానన్నారు. తన బిడ్డకు మంచి వైద్యం అందించేందుకు, నాకు సహాయం చేసి అండగా నిలిచేందుకు వచ్చిన చెవిరెడ్డి పై నేనేందుకు కేసు పెడతాను?' అని ప్రశ్నించాడు. పోలీసులు ఉద్దేశ పూర్వకంగానే దురుద్దేశంతో ఆయనపై కేసు పెట్టారన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లాల వైసిపి అధ్యక్షులు భూమన కారుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉన్నత విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - క్యాంపస్ : ఉన్నత విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏబిఆర్ఎస్ఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు ఆచార్య వైవి రామి రెడ్డి కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కేంద్ర, రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ఇంజనీరింగ్ కళాశాలలు వంటి ఉన్నత విద్యాసంస్థలలో అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కరిం చాలని కోరుతూ ఆచార్య వైవి రామిరెడ్డి ఢిల్లీలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ వైస్ ఛైర్మన్, ఐసిఎస్–ఎస్ఆర్ ఇన్‌ఛార్జి ఛైర్మన్ ప్రొఫెసర్ దీపక్ కుమార్ శ్రీవాత్సవ్‌ని కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లోని విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల స్థానాలను భర్తీ చేయాలని, రాష్ట్రంలోని మొత్తం 17 విశ్వవిద్యాలయాలకు పూర్తి సమయం ఉప కులపతులను నియమించాలని, రాష్ట్ర విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్న పరిశోధక విద్యార్థులకూ యుజిసి , ఐసిఎస్ఎస్ఆర్, ఐసిహెచ్ఆర్, డిఎస్టి వంటి సంస్థల ఇస్తున్న ఉపకార వేతనాలను కేంద్ర విశ్వవిద్యాలయాల పరిశోధక విద్యార్థులతో సమానంగా కేటాయించాలని కోరారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ నుంచి అసోసియేట్ ప్రొఫెసర్‌కు ప్రస్తుతం వున్న 12 సంవత్సరాల సర్వీసును 9 సంవత్సరాలకు కుదించాలని, నూతన జాతీయ విద్యా విధానంపై అధ్యాపకులకు సరైన అవగాహనకల్పించే విధంగా శిక్షణ ఇవ్వాలని కోరారు. స్పందించిన యూనివ ర్సిటీ గ్రాంట్స్ కమిషన్ వైస్ ఛైర్మన్, ఐసి ఎస్ఎస్ఆర్ ఇన్‌ఛార్జి ఛైర్మన్ ప్రొఫెసర్ శ్రీ వాత్సవ సమ స్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు.

ఆచార్య బి దేవప్రసాదరాజుకు ఘన సన్మానం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఫిజిక్స్ విభాగాధిపతిగా నూతనం గా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య బి దేవ ప్రసాద్ రాజును నెల్లూరు విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్ విజయభాస్కరరావు ఆ విభాగంలో ఘనంగా దుశ్శాలువ, పుష్పగుచ్చంతో ఘనంగా సన్మానించారు. ఫిజిక్స్ విభాగాధిపతిగా ఆచార్య దేవ ప్రసాదరాజు ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను విసి ఆచార్య విజయభాస్కరరావు శాలువా, పుష్పగుచ్చం, జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విభాగాధిపతి ఆచార్య ఆర్పీ విజయలక్ష్మి, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

నేటి నుండి రేషన్ కార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: ఏపీ ప్రజలకు సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు స్వీకరించనుంది.ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు ఇతర సర్వీసులకు కూడా అవకాశం కల్పించనుంది. డిసెంబర్ 2 నుంచి 28వ తేదీ వరకూ గ్రామ, వార్డు సచివాలయాల్లో ఇందుకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించనుంది. మార్పులు, చేర్పులు చేసిన కార్డులు, కొత్త కార్డులన్నింటినీ.. సంక్రాంతి 2025 కానుకగా లబ్ధిదారులకు అందించేలా ప్లాన్ చేసింది. గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వక పోవడంతో.. కొత్తగా పెళ్లిళ్లు అయినవారు, రాజకీయాల కారణాలతో రేషన్ కార్డులు రానివారు వేల సంఖ్యలో ఎదురుచూస్తున్నారు. కొత్త రేషన్ కార్డులు, కార్డుల్లో మార్పులు, సభ్యుల తొలగింపు. వంటి దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయి. కొత్త దరఖాస్తులతో పాటు వీటిని కూడా పరిశీలించి కొత్త రేషన్ కార్డులను అందించనుంది.

కుప్పకూలిన సెల్ టవర్

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఫెంగల్ తుపాను కారణంగా ఉపయోగంలోలేని సెల్ టవర్ ఆదివారం కుప్పకూలింది. అయితే ఆ సమయంలో సంచారం లేకపోవడంతో పేరు ప్రమాదం తప్పింది. పట్టణంలోని భాస్కర్ పేటలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రం పక్కన ఉపయోగంలో లేని సెల్ టవర్ ఉంది. పెంగల్ తుపాన్ వల్ల ఆదివారం ఒక్కసారిగా కుప్పకూలి ఆరోగ్య కేంద్రంపై పడింది. అయితే ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఆరోగ్య కేంద్రం పక్కనే మున్సిపల్ హై స్కూల్, ప్రైమరీ స్కూల్, అంగన్వాడి స్కూల్ లు ఉన్నాయి. అయితే సెలవు రోజున సెల్ టవర్ కుప్పకూలడంతో ప్రమాదం తప్పిందని ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రజారోగ్యం బలోపేతానికి ఐఎంఏ సహకారం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఆంధ్రప్రదేశ్‌లో ప్రజారోగ్యం బలోపేతం చేయడానికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తన వంతు సహకారాన్ని అందించి పటిష్టమైన ఆరోగ్య వ్యవస్థను రూపొందించడానికి ప్రణాళికలు చేస్తున్నామని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గార్లపాటి నందకిషోర్ పేర్కొన్నారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐఎంఏకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖలో 22 వేలమంది సభ్యులు ఉన్నారని, 26 జిల్లాలలో 99 శాఖలుగా ప్రజారోగ్య పటిష్టతకు పనిచేస్తున్నామన్నారు. జిల్లాలో నాలుగు గ్రామాలను ఐఎంఏ దత్తత తీసుకొని అక్కడి ప్రజల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నామన్నారు. గ్రామీణ వాతావరణం లో ఉండే ప్రజలు పూర్తి ఆరోగ్యవంతులుగా ఉండేవారని, ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో కూడా మహిళలు రక్తహీనతతో, మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని గుర్తించామన్నారు. అధిక మోతాదులో యాంటీబయాటిక్స్ వినియోగం వల్ల యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ ప్రమాదం పొంచి ఉందన్నారు. ఫార్మసీలలో పనిచేసే ఫార్మసిస్టులు అసిస్టెంట్ల కు యాంటీ బయాటిక్ వినియోగా లపై శాస్త్రీయ అవగాహన కల్పించనున్నామన్నారు. ప్రభుత్వం కూడా వైద్యులకు తగిన సహకారాన్ని అందించాలని, విద్యుత్ చార్జీలు కమర్షియల్ గా వసూలు చేయడం, భవన ఆస్తి పన్నులలో, మందులపై, వైద్య పరికరాలపై జిఎస్టి శాతాన్ని తగ్గించడంతో వైద్యం భారం కాదన్నారు. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వైద్యులపై దాడులకు సంబంధించి 2008లో తీసుకువచ్చిన చట్టంలో కొద్దిపాటి సవరణలు చేసి పటిష్టంగా అమలు చేస్తే వైద్యులపై దాడులు జరగవన్నారు. ఈ సమావేశంలో ఐఎంఏ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు, ఐఎంఏ ప్రతినిధులు టి.జనార్ధన్, ఏఆర్ రెడ్డి, సేవకుమార్, శ్యాం బాబు, రెడ్డప్ప పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని నెల్లేపల్లికి సమీపంలో ద్విచక్ర వాహనదారున్ని ఓ కారు అదుపుతప్పి ఢీకొనింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు మరణించాడు. గంగాధరనెల్లూరు మండలం మోతరంగనపల్లె గ్రామానికి చెందిన గజేంద్ర(34) చిత్తూరు నగరంలో జైన్ డ్రిప్ ఇరిగేషన్ షాపులో సూపర్వైజర్‌గా పనిచేస్తున్నారు. కాగా ఇతను శనివారం తిరుపతి సమీపం రాయల్ చెరువులో అత్తగారింటికి వెళ్లి ఆదివారం ఉదయం మోతరంగనపల్లికి తిరిగి వస్తుండగా మండలంలోని నెల్లేపల్లికి సమీపంలో చిత్తూరు వైపు నుంచి పుత్తూరు వైపుకు వస్తున్న కారు అదుపుతప్పి ద్విచక్ర వాహనంపై వస్తున్న గజేంద్రను ఢీకొనంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన అతన్ని అంబులెన్స్‌లో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించినట్లు స్థానికులు తెలిపారు. దీంతో మృతుడు భార్య తనూజ జీడీ నెల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

గడ్డివామి కూలి ఆవు, దూడ మృతి





ప్రజాశక్తి-పెద్దపంజాణి: ఫెంగల్ తుఫాను మండల వ్యాప్తంగా రైతులకు అపార నష్టం చేకూర్చింది. ఈ క్రమంలో శివాడి గ్రామానికి చెందిన దళిత రైతు టి రవి తన జీవనాధారమైన ఆవు, దూడను తన గడ్డివామి కింద శనివారం రాత్రి మేత వేసి పెట్టాడు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలదాడికి గడ్డివామి నేలకూలడంతో కిందనేఉన్న పాడి ఆవుతోపాటు లేగదూడ సైతం మృతి చెందింది. బాధితుని వివరాల మేరకు వ్యవసాయం చేసుకోని జీవనాధారం కోసం ఓ పాడిఆవుని సైతం పెంచుకుని దాని ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నానని అన్నారు. శనివారం రాత్రి ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షందెబ్బకు బాగాతడిసిన గడ్డివామి ఒక్కసారిగా కూలడంతో పాడిఆవుతో పాటు లేగదూడ అక్కడికక్కడే మృతి చెందినట్లు రైతు తెలిపారు. తన కుటుంబానికి జీవనాధారమైన పాడిఆవు మృతితో లక్షరూపాయలు దాకా తనకు నష్టంవాటిల్లిందని బాధితరైతు రవి ఆవేదన వ్యక్తం చేశాడు. స్థానిక వెటర్నటీ వైద్యాధికారి సరిత ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు కోరుతున్నారు.

బిసి సంక్షేమ గృహాల్లో వసతులు కల్పించండి

మంత్రికి టీడిపి నేతల వినతి



ప్రజాశక్తి- రామకుప్పం: రాష్ట్రంలో బీసీ సంక్షేమ వసతి గృహాల్లో వసతులు మెరుగుపరచాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితకు రామకుప్పం టిడిపి నేతలు విజ్ఞప్తి చేశారు. ఆదివారం పెనుకొండలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీసీ యువతకు స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయాలని, బీసీ రైతులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలని మంత్రిని కోరారు. దీంతో మంత్రి సానుకూలంగా స్పందిస్తూ బీసీల సంక్షేమానికి కృషి చేస్తామని.. ప్రతి ఒక్క కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని వారు ఆర్థిక అభివృద్ధి చెందేలా కార్యచరణలు రూపొందిస్తామన్నారు. కూటమి ప్రభుత్వంలో బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మంత్రిని కలిసిన వారిలో టీడిపి రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మునస్వామి, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు కృష్ణ నాయక్, మాజీ సర్పంచ్ రామ్మూర్తి, గిరి దాసు, హరి, పృధ్వి, తిరుపతి, బి కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి నుండి ముంబైకి

ఇండిగో విమాన సర్వీసులు ప్రారంభం..



ప్రజాశక్తి -రేణిగుంట: ఇండిగో ఎయిర్‌లైన్స్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి రామ్మోహన్ నాయుడు కృషి, నాయకత్వంలో తిరుపతి నుండి ముంబైకి నేరుగా విమాన సర్వీసులు ప్రారంభించిందని తిరుపతి విమానాశ్రయ డైరెక్టర్ శ్రీనివాస రావు మన్నె ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతి విమానాశ్రయ డైరెక్టర్ మాట్లాడుతూ.. ఈరోజున తిరుపతిలో ప్రారంభించిన నేరుగా వెళ్లే తిరుపతి – ముంబయి ఇండిగో విమాన సదుపాయంతో తిరుపతి విమానయాన రంగానికి కొత్త అధ్యాయాన్ని తెరచిందన్నారు. ఫ్లైట్ నంబర్ 6 ఇ 532 ముంబై నుండి తిరుపతికి విమానం ఉదయం 05:30 గంటలకు బయలుదేరి, 07:15 గంటలకు తిరుపతికి చేరుకుంటుందనీ, ఫ్లైట్ నంబర్ 6 ఇ533 తిరుపతి నుండి ముంబయికి విమానం ఉదయం 07:45 గంటలకు బయలుదేరి 9.25 గం.లకు ముంబయికి చేరుకుంటుందన్నారు. ఈ విమాన సర్వీసు వారానికి ఏడు రోజులు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ నేరుగా విమాన సదుపాయం ప్రారంభంతో, తిరుపతి మరోమెట్రోనగరంతో విజయవంతంగా అనుసంధానమైందని, ఇది తిరుపతి విమానయాన రంగంలో ప్రగతిని సూచిస్తుందన్నారు. ఈ సదవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విమానాశ్రయ సిఎస్ఓ రాజేంద్ర ప్రసాద్, విమానాశ్రయ అధికారులు, సిబ్బంది ఇండిగో ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు మెట్లెక్కిన ఉచిత సేవకులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తమను ఆలయ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలంటూ శ్రీకాళహస్తీశ్వరాలయ ఉచిత సేవకులు హై కోర్టు మెట్లెక్కారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో పదేళ్లుగా ఉచిత సేవ చేస్తున్న 18 మందిని ఆలయ ఉద్యోగులుగా గుర్తించి జీత భత్యాలు చెల్లించాలని గత పాలకమండలి 2022లో రాష్ట్ర దేవాదాయ శాఖకు విన్నవించింది. పాలకమండలి అభ్యర్థనను మన్నించిన దేవాదాయశాఖ కమిషనర్ 18 మంది ఉచిత సేవకులను అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తిస్తూ వేతనాలు చెల్లించాలంటూ 2023లో ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వారిని గురుదక్షిణామూర్తి వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కింద అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా తీసుకుంటూ టెండర్ దాఖలు చేశారు. వీరు ఎన్నికల ముందు మూడు నెలలు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పని చేశారు. అయితే ప్రభుత్వం మారగానే విధులకు రాకుండా అడ్డుకున్నారు. జీత భత్యాల సంగతిని పక్కన పెట్టేశారు. ఈ విషయంపై పలుమార్లు ఈవో ల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. ఉచిత సేవకులపై వైసీపీ ముద్ర పడటంతో స్థానిక ఎమ్మెల్యే నుంచి కూడా సహకారం అందని పరిస్థితి. దీంతో చేసేది లేక ఉచిత సేవకులు హై కోర్టును ఆశ్రయించారు. తమను తొలగించి కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న వారిని నియమించుకోవాలన్న కుట్రతో ఇదంతా చేస్తున్నారని ఉచిత సేవకులు వాపోతున్నారు. పొట్ట కూటి కోసం కొలువులు వెతుక్కుంటున్న తమను రాజకీయ ముద్ర వేసి తమ పొట్ట కొట్టొద్దని వాపోతున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

రక్షించిన పోలీసులు



ప్రజాశక్తి -తిరుపతి సిటీ : తన భార్య మనస్తత్వంతో ఆత్మహత్యకు పాల్పడుతుందని వెంటనే కాపాడాలని ఓ భర్త పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే స్పందించిన పోలీసులు ఆమె ప్రాణాల్ని కాపాడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పోలీస్ కమాండ్ కంట్రోల్‌కి ఫోన్ చేసి తన భార్య తనతో గొడవపడి గొడవపడి వినుకొండ నుండి తిరుపతి వచ్చేసినట్లు, 1వ తేదీ, 2:40నిముషాల ప్రాంతంలో విష్ణుని వాసం, తిరుపతి నుండి తనకు కాల్ చేసి తను రైల్వే స్టేషన్‌కి వెళ్లి ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి కాల్ కట్ చేసిందని సమాచారం అందిందని తెలిపి తన భార్య ప్రాణాలు కాపాడాలని కోరాడు. వెంటనే ఎస్పీ ఆదేశాల మేరకు మహిళ ఫొటోలు, ఆధారాలను సేకరించి విష్ణునివాసం , రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలో ఫొటో ఆధారంగా హుటాహుటీ న క్షుణ్ణంగా వెతకాలని మహిళా రక్షక్, బ్లూకోట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. కమాండ్ కం ట్రోల్ సమాచారంపై మహిళా రక్షక్, బ్లూకోట్స్ సిబ్బంది హుటాహుటిన విష్ణు నివాసం, రైల్వే స్టేష న్ ప్లాట్ ఫామ్ లో పై అణువణువు క్షుణ్ణంగా వెతు కుతూ ఉండగా రైల్వే స్టేషన్ చివర ప్లాట్‌ఫామ్ ట్రా క్ వద్ద మహిళను కనుగొన్నారు. మహిళకు ఆహార పానీయాలు అందించి కౌన్సెలింగ్ ఇచ్చి వారి కుటు ంబ సభ్యులకు సమా చారం తెలిపారు. కమాండ్ కంట్రోల్ సిబ్బంది స్పందించి వెంట వెంటనే సమా చారాలు సేకరించి సత్వర చర్యలు తీసుకోవడం వల్ల మహిళ ప్రాణాలు కాపాడారు. ప్రస్తుతం పోలీ సుల సంరక్షణలో ఉన్నారు. సకాలంలో స్పందించి మహిళ ప్రాణాలను కాపాడిన పోలీసులను ఎస్పి సుబ్బరాయుడు అభినందించారు. క్షణికావేశంలో తొందరపాటుతో నిర్ణయం తీసుకోవద్దని సూచించారు.

పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని డాక్టర్ సి.ఆర్ రెడ్డి ఆసుపత్రి నందు ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా ప్రగతి సేవా సంస్థ , ఇన్నర్ వీల్, ఆంధ్ర మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు 30 మందికి పౌష్టికాహారాన్ని డాక్టర్ జనార్ధన్ రెడ్డి , డాక్టర్ రోహిణి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సేవా సంస్థ సభ్యులు కడివేటి చంద్రశేఖర్, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు డాక్టర్ తనూజ, అనిత , విష్ణు వందన పాల్గొన్నారు.